"ఏదో తెలుసుకోవాలని ప్రయత్నించిన కృషి ఇప్పుడు మరో కొత్త విషయం వింటున్నట్టు ఆసక్తిగా " గ్రాండ్‌పాకి, చౌదరికీ గొడవలున్నాయా"

"ఉపాధ్యాయగారి స్థాయినిబట్టి తనంతట తానుగా చౌదరితో గొడవపడే అవకాశంగాని అవసరంగానీ లేవు కృషి. . . కానీ చౌదరి తానే కోరి మీ తాతయ్యతో గొడవ ప్రారంభించాడు" డాక్టర్ మహంతి సంకోచించలేదు చెప్పడానికి. ఒకనాడు తాతయ్యకి సంబంధించిన చాలా విషయాలు వినడానికి ఆసక్తి చూపించని కృషి యిప్పుడు యిలాంటి సంయమనాన్ని ప్రదర్శించడం ఆనందంగా వుంది. "ఫ్యాక్టరీ కార్మికుల కోసం ఓ హాస్పిటల్ కట్టించాలని సరిగ్గా పదేళ్ళ క్రితం ఫ్యాక్టరీ దగ్గరగా పదెకరాల భూమి కొన్నారు మీ గ్రాండ్‌పా. . . కన్‌స్ట్రక్షన్ ప్రారంభం కావటానికి కొన్ని ఫార్మాలిటీస్ వుంటాయిగా. . . ఈ లోగా ఆ లేండ్ కావాలన్నాడు చౌదరి."

"దేనికి"

"తను ఓ హోటల్ కట్టించాలని- డబ్బు ఎంత చెల్లిస్తానన్నాడన్నది కాదు సమస్య..... అదే లేండ్ కావాలని చౌదరి అడగటంతో తాతయ్య తిరస్కరించాడు. పొలిటికల్‌గా చాలా ఒత్తిడి తెచ్చాడు కూడా. అయినా మీ తాతయ్య వీల్లేదని ఖండితంగా చెప్పేశాడు. అంతే. . . ఓ అర్ధరాత్రి అక్కడ గుడిసెలు వేయించాడు. దాన్ని బడుగు వర్గాల కాలనీగా ప్రభుత్వం గుర్తించాలని నిరహార దీక్షలాంటిది చేసి పెద్ద రాద్ధాంతానికి కారణమయ్యాడు."

"తాతయ్య లీగల్‌గా ఎదుర్కోలేడా?"

"ఈ దేశానికి ఇలాంటి కేసులు దశాబ్దాల తరువాత గానీ ఓ కొలిక్కి రావు కృషి. కేసు నడుస్తూంది. ఇక ముందూ నడుస్తుంది. ఐతే ఆ తర్వాత మీ గ్రాండ్ పా ఫ్యాక్టరీలో చౌదరి కార్మికుల ద్వారా సృష్టించిన, ఇంకా సృష్టిస్తున్న అల్లర్లు కాని, ప్రభుత్వ పరంగా ఎలక్ట్రిసిటీ వాటర్ సప్లయ్ విషయంలో కలిగిస్తున్న విఘాతాలు కాని నువ్వూహించలేవు. ఒక్కమాటలో చెప్పాలీ అంటే మీ తాతయ్య అనారోగ్యానికి ఖచ్చితంగా ఈ సమస్యలే కారణం కాకపోయినా ఈ సమస్యలు కూడా ఆయన్ని మానసికంగా కృంగదీస్తున్నాయని మాత్రం చెప్పగలను."

ఆ తర్వాత కృషి ఇక మాట్లాడలేదు.

డాక్టర్ మహంతి చెప్పిన విషయాల్లోని ఆ చివరి పంక్తులు ఆమె ఎంత కలవరపరిచాయీ అంటే అవే మాటల్ని పదేపదే మననం చేసుకుంది. . .

ఒక నేరస్తుడు - ఒక దళారి - ఒక సంఘ విద్రోహకశక్తి తాతయ్యపై విజయం సాధించాడు. ఆ ప్రభుత్వాన్ని పాలిస్తున్నది దళారీలు, గూండాలు కావడంతో వేలమంది నిరుపేదలకి ఉపాధిని కల్పించగలుగుతున్న తాతయ్య ఉనికిని ప్రశ్నిస్తూంది.

పేదల సంక్షేమ న్యాయంగా సంపద పంపిణీ సర్వం సహకారాలు గల రాజ్య వ్యవస్థ అనే సూత్రాల్ని వల్లెవేసే బ్యూరోక్రాట్స్, రాజకీయ దళారులు ఆశ్రిత వ్యాపార గణానికి

సంపద సృష్టికి అవకాశాలు మృగ్యమై పోతున్నాయి.

పారిశ్రామిక విస్తరణ, ఆరోగ్యప్రదమైన పోటీతత్వం, అధునాతన టెక్నాలజీకి ఆహ్వానం - ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడాల్సిన అవకాశాల్ని కాక అవినీతి విస్తృతం కావటానికి ఆర్థిక దుస్థితిలో ద్రబ్యోల్బణం పెరగడానికి కొందరు స్వార్థపరులు కారణమౌతున్నారు.

ఇవన్నీ కాదు - చాలా గర్వంగా బ్రతుకుతున్నాడనుకున్న తాతయ్య కూడా ఓటమిలాంటి స్థితిలోనే కూరుకుపోయారు. దానికి కారణం చౌదరి. ఈ వ్యవస్థలోని కాలుష్యాన్ని మొత్తం కడిగేయగల శక్తి తనకు లేదు. కాని చౌదరిలాంటి ఓ దుష్టశక్తిని ఎదుర్కోవాలనుంది.

చాలా చిన్న విషయాలు ఒక్కోసారి మనసుని ఎంత కలవరపరిచేదీ ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నట్టుగా అంది. "స్టేట్స్‌కి వెళ్ళిపోదామనుకున్న నేను ఎందుకు వున్నదీ ఇప్పటిదాకా ఖచ్చితంగా నాకూ తెలీదు అంకుల్. కాని వున్నందుకు ఏదో చేయాలనిపిస్తుంది."

ఓ చిన్న ప్రారంభానికి అంకురార్పణలా ఆ క్షణాన ఆమె గుర్తు చేసుకుంది. చౌదరిని కాదు. . .

డబ్బు కోసం ఏదన్నా చేయగల విశ్వని . . .

0 0 0 0

"హల్లో"

మంద్రంగా వెలుగుతున్న బ్లూ లాగూన్ రెస్టారెంటు విద్యుద్దీపాల కాంతిలో కృషి మెరుస్తున్న తారకలా కనిపించింది.

రాజేంద్రతో ఉత్సాహంగా మాట్లాడుతున్న విశ్వ ముందు ఉలికిపడ్డాడు. మరుక్షణం పలకరింపుగా నవ్వి వెంటనే ఆహ్వానంలా కూర్చోమన్నట్టుగా చూశాడు.

ఏదో మాట వరసకి అన్నాడే కాని ఇలా ఆమె వస్తుందని ఊహించలేక పోయాడు.

"ఇండస్ట్రియలిస్టు ఉపాధ్యాయగారి గ్రాండ్ డాటర్ కృషీ- ఇతను రాజేంద్రని" విశ్వ పరిచయం చేస్తుంటే అర్థోక్తిగా ఖండించాడు.

"మిస్టర్ రామనాథ్ చౌదరి ఒక్కగానొక్క కొడుకు, నిన్న మీతో ఐక్యూలో పోటీపడ్డ డిఫెండింగ్ ఛాంపియన్- ఇప్పుడు మీ ఓటమికి ధర చెల్లిస్తూ. . ."

"స్టాపిట్" ఆవేశంగా అరిచాడు రాజేంద్ర. "మీరు నన్ను ఇన్సల్టు చేస్తున్నారు"

"వందలమంది ప్రేక్షకుల్ని మోసం చేసిన మీ మీద గౌరవం ఉంటుందని ఎలా అనుకుంటున్నారు".

"వాట్ నాన్సెన్స్ ఆర్యూ టాకింగ్"

"సన్నివేశాన్ని ఎదుర్కొనే నైతిక శక్తి లేనివాడు ఇలాగే అరుస్తాడు మిస్టర్ రాజేంద్ర" సూటిగా విషయానికి వచ్చింది. "చెప్పండి నిజంగా మీరు మరోసారి ఐక్యూ కాంపిటీషన్‌లో మరో ప్రత్యర్థిని ఎదుర్కోగలరా. . . అఫ్‌కోర్స్- చేతకాదు అంటే వెంటనే చెప్పండి"

పైకి లేచాడు రాజేంద్ర

"పారిపోతున్నారేం-"

ఒక అందమైన అమ్మాయి పైగా తన తండ్రికి ప్రత్యర్థి అయిన ఉపాధ్యాయ మనవరాలు ఇలా దారుణంగా అవమానిస్తుంటే తట్టుకోలేకపోతున్నాడు "వాట్ డూయూ మీన్"

"ఓకే. . . మీరు వెళ్ళొచ్చు" అంది కృషి.

"దమ్ముంటే పోటీ ఏర్పాటు చేయండి" అన్నాడు ఉక్రోషంగా. "ఒక్క విశ్వనాథ్‌నే కాదు అలాంటి వందమందితో ఛాలెంజ్ చేయమనండి"

"వెల్‌కమ్"

"కాని ఈ సారి ఇరవై వేలు కాదు" గుర్తుచేశాడు రాజేంద్ర.

"లక్ష రూపాయలు- సరేనా" అంది కృషి.

రాజేంద్ర మొహం వివర్ణమైపోయింది. "అంత పెట్టుబడి పెట్టబోతున్నారా?"

"నాలక్ష్యం నీ ఓటమి. . . కావాలంటే రెండు లక్షల పెట్టుబడికైనా సిద్ధం."

"ఓకే- నేను రడీ" ఆవేశంగా విజిటింగ్ కార్డు టేబుల్‌పై గిరాటేసి వెళ్ళిపోయాడు.

అప్పటికి చాలా ఇబ్బందిగా కూర్చున్న విశ్వ ఓపిక నశించినట్టుగా అన్నాడు "మీరిలా చేయాల్సింది కాదు."

నవ్వింది అవహేళనగా "ఏది చెయ్యకూడదో, ఏది చెయ్యొచ్చో డబ్బు కోసం ఏదన్నా చెయ్యగల నువ్వు మాట్లాడ్డం దారుణం"

చురుక్కుమంది. ఐనా తమాయించుకున్నాడు. "రాజేంద్ర బేక్‌గ్రౌండ్ మీకు అంతగా తెలీదనుకుంటాను."

"అలా ఆలోచించాల్సింది గాలివాటుగా బ్రతికేవాళ్ళు."

ఈ వాక్యమూ తగలకూడని చోటనే తగిలింది.

డబ్బున్న ఓ అమ్మాయి ఇక్కడ అవసరానికి మించిన స్వాతిశయాన్ని ప్రదర్శిస్తోంది.

"నేనూ రాజేంద్రని మించిన ఆస్థిపరురాలినే విశ్వా. కాబట్టి రెండు లక్షలు ఖర్చు చెయ్యడం నాకు శ్రమ కాదు."

"గెలుపు అంత సులభం కాదు."

"నీకూనా"

రెచ్చగొడుతున్నట్టుగా చూసింది.

"మాట్లాడు విశ్వా. . . నీకు చేతకాదంటే చెప్పు- మరో సమర్థుడ్ని రంగంలోకి దింపుతాను. ఏమిటి అలా తెల్లమొహం వేసుకు చూస్తున్నావు. ఐనా డబ్బుకోసం స్వాభిమానం చంపుకోగల నీలాంటివాడు ఇలా రియాక్టు కావడం ఘోరం."

ఉన్నవాళ్ళ భేషజం అతడికి సరిపడదు. ఇప్పుడు కృషి అదే వ్యక్తం చేస్తోంది.

ఏ అభిజాత్యాన్ని అతడు సహించలేడో కృషి అదే ఎగ్జిబిట్ చేస్తూ అతడ్ని దారుణంగా గాయపరిచింది.

"నిజంగా మీరు రెండు లక్షలు పెట్టుబడి పెడతారా"

"యస్. . . గెలవగల సమర్థుడికి"

"ఒకవేళ మీరనుకుంటున్న సమర్థుడు ఓడితే. . ."

"ఊరుకోను. రెండు లక్షలు నాకు చెల్లించమంటాను."

"చెల్లించే శక్తి లేకపోతే. . ."

"ఆరు నెలలపాటు మాయింటి గూర్ఖాగా వూడిగం చేయించుకుంటాను. ఓ గూర్ఖాకి అంత జీతం యిస్తారా అని అడక్కు. అది నా స్టేటస్‌కి సంబంధించింది. చెప్పు. నువ్వు పోటీకి సిద్ధపడతావా. . .మరో సమర్థుడ్ని వెదుక్కోమంటావా. . ."

హఠాత్తుగా అక్కడ నిశ్శబ్దం ఆవరించింది.

"అక్కర్లేదు. నేనే పోటీ పడతాను."

"కాని మరో ఏభైవేలు రాజేంద్ర నుంచి ఎక్కువ తీసుకుని ఓడిపోకూడదు."

ఆవేశంగా పైకి లేచిన విష్ణు బార్ కౌంటర్ దగ్గరికి వెళ్ళి ఓ కాగితంపై చకచకా రాసేడు. "ఇది మీ దగ్గర వుంచుకోండి" అన్నాడు కాగితాన్ని అందిస్తూ.

"ఏమిటిది" అంది కాగితాన్ని అందుకోకుండా. . .

"మాట పట్టింపు వున్నవాళ్ళకే కాదు లేనివాడికీ వుంటుందని నిరూపించే మోరల్ అగ్రిమెంట్. నేను ఓడితే మీ ఇంట ఆరునెలలు గూర్ఖాగా పనిచేస్తానని రాసిన పేపరు. కాని నేను గెలిస్తే."

"చెప్పు"

"నాక్కావాల్సింది రెండు లక్షలు కాదు"

"మరి. . ."

"మీరు నాతో ఒక రాత్రి గడపాలి"

ఉలిక్కిపాటుగా చూసింది. మెదడు పొరల్లో పేలిన విస్ఫులింగాలు ఆమె కళ్ళలో క్రోధాన్ని నింపుతుంటే నిశ్శబ్దంగా వుండిపోయింది చాలా సేపటిదాకా. . .

"బలవంతం లేదు మిస్ కృషి. . . మీరు సరేనంటేనే ఈ పందేనికి సిద్ధపడదాం..... ఆలోచించుకోండి. సరే అని నోటితో అనాల్సిన పనిలేదు. ఈ కాగితాన్ని అందుకుంటే అది మీ అంగీకారమనుకుంటాను."

రెండు యుద్ధాల మధ్య ప్రశాంతతలాంటి విరామం.

కోరిన గెలుపు కోసం చాలా మూల్యాన్ని కోరుతున్న ఓ అనామకుడు యిప్పుడు తన వునికినే ప్రశ్నిస్తున్నాడు.

రెండు నిముషాలు గడిచాయి.

అంతే. కాగితాన్ని అందుకుంది ఉద్విగ్నంగా

ఆరాత్రి విష్ణు నిద్రపోలేదు.

నగర పొలిమేరల్లో వున్న ఓ అనాథాశ్రమపు గదిలో పడుకుని అటూ యిటూ పొర్లుతున్నాడు.

మనో ఆకాశంపై కదలాడుతున్న జ్ఞాపకాల మేఘాలు. . . అబద్ధాన్ని ఆశ్రయించిన సుఖాలవంటి ఆలోచనలు వూపిరాడక గిజగిజలాడుతున్న నిశబ్దం నీరసం. . . సరుగుడు చెట్ల నీడలలో ఉల్లాసంగా తిరిగే వయసు మిగిల్చిన చేదు వాస్తవాలు అతడ్ని అనూహ్యమైన అసహనానికి గురిచేస్తుంటే పైకి లేచాడు.

పక్కన ఆదమరిచి నిద్రపోతున్నాడు సూరి. విశ్వకి స్నేహితుడు. ఆ రోజు కృషి వేలెట్‌ని కాజేసిన వ్యక్తి.

సూరిని క్షణంపాటు తదేకంగా చూసి గదిదాటి బయటకి వచ్చాడు విశ్వ.

శాటిన్ తెరలా కప్పిన చీకటి - సమాధిలో ముందొక పర్ణశాలలాంటి కుటీరం, దానికి ఆనుకుని వున్న అనాథ బాల శరణాలయం, దాని ప్రక్కన స్త్రీ సేవాసదన్. . . ప్రపంచం నుంచి విడదీస్తున్న ఫెన్సింగ్‌కి ఆవల దట్టంగా ఆవరించిన చెట్లు.

పిచ్చిగా తిరిగాడు తెల్లవారేదాకా.

ఎక్కడో మొదలైన జీవితం హఠాత్తుగా ఇక్కడ ముగిసి మరో ఆరంభానికో గుర్తుగా మారిపోయింది.

మధ్యలో ఆగిన చదువు సగంలో విరిగి స్వప్నమై ఇక్కడి అనాథలకి ఆసరా కమ్మని శాసిస్తే యిదే జీవితం అంటూ యిలా రాజీపడిపోతున్న విశ్వాకి ఆ క్షణాన ఏం గుర్తుకొచ్చిందో స్త్రీ సేవాసదన్ దాకా నడిచాడు.

ముందు ఓ గది. ఆ గది కిటికీ దగ్గరే నిలబడ్డ ఓ మధ్య వయస్కురాలు అతడ్ని గమనించలేదు. గమనించినా అతడెవరన్నదీ గుర్తుపట్టనట్టు బయటికి చూస్తోంది ఎవరి ఆగమనం కోసమో నిరీక్షిస్తున్నట్టు.

"అమ్మా" పిలిచాడు ఆర్తిగా .

జవాబు లేదు.

తన పిలుపికి ఆమె స్పందించింది ఎన్ని నెలల క్రితమో అతడికి గుర్తులేదు. మరెన్ని యుగాల తర్వాత తనను గుర్తుపట్టి పరవశంగా దగ్గరకు తీసుకుంటుందో అంతకన్నా అర్థం కాదు.

ఏ శూన్యం ఆమె మస్తిష్కపు పొరల్ని కప్పి ఆమెను మతిభ్రమించిన స్త్రీగా మార్చిందో గాని ఆమెను మళ్ళీ వాస్తవానికి రప్పించగలనన్న నమ్మకం లేదు.

అలాగే నిలబడ్డాడు ఓ తపస్సులోలా చలనం లేనట్టుగా.

ఎంతసేపు అలాగే వుండిపోయాడో అతడికి గుర్తులేదు.

భుజంపై చేయిపడటంతో తేరుకుని వెనక్కి చూశాడు.

భానుడిలా అనిపించే బాబా చైతన్యానంద.